# బలగం TV BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 11 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఢిల్లీకి ముఖ్యమంత్రి



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ, సక్సెస్, వచ్చిన పెట్టుబడుల వివరాలను పార్టీ అధిష్టానానికి వివరించేందుకే ఆయన ఢిల్లీ వెళ్లినట్టు సమాచారం. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడే ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సహా పార్టీ అగ్రనేతల్ని కలిసి గ్లోబల్ సమ్మిట్ వివరాలు తెలుపనున్నారు. అలాగే ప్రధాని నరేంద్రమోడీని కూడా కలిసే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. బుధవారం రాత్రి ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు, సీనియర్ నాయకులు శరద్ పవార్ నివాసంలో ఏర్పాటు చేసిన ప్రయివేటు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. అక్కడే రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు.

## స్టార్టప్‌లకు
# రూ.1000 కోట్లతో ఫండ్

- హైదరాబాద్ లక్ష్యం 100 యూనికార్న్ స్టార్టప్‌లు
- 2034 నాటికి 10 సూపర్ యూనికార్న్‌లు
- హైదరాబాద్‌లో ఎదిగిన స్టార్టప్‌లు.. ప్రపంచ స్థాయి కంపెనీలే
- ఇన్నోవేటివ్, ఐపీ ఆధారిత స్టార్టప్‌లపై దృష్టి పెట్టాలి
- స్టార్టప్ ఎకోసిస్టమ్ కోసం ప్రభుత్వం-గూగుల్ భాగస్వామ్యం
- సీఎం రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్ ప్రారంభం



**బలగం టీవీ, హైదరాబాద్:**

స్టార్టప్ కంపెనీను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో స్టార్టప్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని స్టార్టప్ కంపెనీలను ప్రారంభించడమే కాకుండా కనీసం 1 బిలియన్ డాలర్ల కంపెనీలుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ టీ-హబ్ లో ఏర్పాటు చేసిన గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్ ను ముఖ్యమంత్రి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న స్టార్టప్ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలన్న లక్ష్యంతో పని చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్ లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నా. అంటే కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలు ఎదగాలి. వీటిల్లో 2034 నాటికి కనీసం 10 స్టార్టప్‌లు సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. 1998 లో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఇద్దరు మిత్రులు కలిసి కారిఫోర్నియాలో స్టార్టప్‌గా ప్రారంభించిన ఒక గ్యారేజీయే ఇప్పుడు గూగుల్‌గా అవతరించింది. ఇదెంతో స్ఫూర్తి దాయకమైన అంశం. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఒక విజన్‌తో ముందుకు సాగుతూ, ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలన్న లక్ష్యంతో రెండు రోజుల పాటు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌పైన గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించాం. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ ప్రతినిధుల సమక్షంలో తెలంగాణ రైజింగ్ విజన్‌ను ఆవిష్కరించాం. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, అలాగే 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ రాష్ట్రం ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. పదిహేను ఇరవై ఏళ్ల కిందట ప్రారంభించబడిన అనేక స్టార్టప్‌లు ఇప్పుడు బిలియన్స్ డాలర్ల కంపెనీలుగా ఎదిగాయి. గూగుల్ , ఆపిల్, అమెజాన్, టెస్లా, మెటా వంటి ఎన్నో ఉదాహరణలు మనముందున్నాయి. గడిచిన 25 సంవత్సరాలుగా సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో ప్రారంభమైన చాలా స్టార్టప్‌లు పెద్ద పెద్ద కంపెనీలుగా ఎదిగాయి. తెలంగాణ రైజింగ్ విజన్‌లో స్టార్టప్‌లకు సంబంధించి మీ ప్రణాళిక ఏమని అడిగినప్పుడు.. స్టార్టప్‌లను నేను ఫుట్‌బాల్ క్రీడతో పోల్చుతా. ఎందుకంటే నేను ఫుట్ బాల్ ఆడుతాను. ఫుట్‌బాల్‌లో సమిష్టి కృషి అవసరం. పట్టుదలతో సాధన చేయాలి. టీమ్ వర్క్‌తో పనిచేయాలి. చివరగా విజయం సాధించడం చాలా ముఖ్యం. స్టార్టప్‌లు కూడా అదే విధంగా పనిచేయాలి. హైదరాబాద్ ప్రస్తుతం వస్తు ఉత్పత్తి ఆధారిత స్టార్టప్‌లు, ఇన్నొవేటివ్ స్టార్టప్‌లు, ఐపీ ఇంటెన్సివ్ స్టార్టప్‌లపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ కేవలం స్టార్టప్స్ మాత్రమే కాకుండా యునికార్న్ కంపెనీల హబ్‌గా ఎదగాలన్నది నా ఆకాంక్ష అని అన్నారు.

మిగితా 2వ పేజీలో

## ఓయూకు వెయ్యి కోట్ల రూపాయల గ్రాంట్





- చారిత్రాత్మక ఉస్మానియాను అంతర్జాతీయ ప్రమాణాలకు తీర్చిదిద్దుతాం
- విద్యార్థుల కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ కూఆర్ కోడ్ విడుదల
- విద్యార్థులందరికీ ఒకే క్యాంపస్.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్
- నైపుణ్య విద్యపై దృష్టి
- ప్రపంచ స్థాయిలో పోటీ పడే ప్రతిభ తయారీ లక్ష్యం
- ఓయూలో నియామకాలపై రాజకీయ జోక్యం ఉండదు
- పరిశోధనలకు పూర్తి సహకారం : ఓయూ సభలో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 4వ పేజీలో

## ఎస్ఐఆర్‌పై తప్పుదోవ పట్టిస్తున్న ప్రతిపక్షాలు

- నెహ్రూ, ఇందిరా హయాంలోనూ ఎస్ఐఆర్ అమలు
- లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రస్తుతం దేశంలోని పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ఓటరు జాబితాల సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. ఎస్ఐఆర్‌పై నాలుగు నెలలుగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారంటూ బుధవారం లోక్‌సభలో తీవ్రమైన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యతేనని, ఎస్ఐఆర్ పూర్తిగా ఈసీ పరిధిలోనే జరిగేదని ఆయన స్పష్టం చేశారు.పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచే ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయని అమిత్‌షా విమర్శించారు. "ఎస్ఐఆర్‌పై పూర్తి సమీక్ష జరపాలన్న విపక్షాల డిమాండ్ అమలు సాధ్యం కాదు. ఎందుకంటే ఆ బాధ్యత ఎన్నికల సంఘానిదే. మేము ఎన్నికలు నిర్వహించము," అని స్పష్టం చేశారు.


**నెహ్రూ, ఇందిరా హయాంలోనూ ఎస్ఐఆర్ అమలు**

ఎస్ఐఆర్ కొత్త విషయం కాదని, 1952లో నెహ్రూ హయాంలోనే తొలిసారిగా అమలులోకి వచ్చిందని, ఇందిరా గాంధీ మరియు మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రుల కాలంలో కూడా ఇదే ప్రక్రియ కొనసాగిందని అమిత్‌షా గుర్తుచేశారు. "ఓటరు జాబితాలను సక్రమంగా సవరించకుండా పారదర్శక ఎన్నికలు ఎలా సాధ్యం?" అని విపక్షాలను ప్రశ్నించారు. అక్రమ వలసదారులు ఓటింగ్ ప్రక్రియలోకి చొరబడకుండా, చనిపోయిన వారి పేర్లు జాబితాల్లో కొనసాగకుండా, ఒకరికి అనేకచోట్ల ఓట్లు లేకుండా చూసేందుకే ఎస్ఐఆర్ చేస్తున్నారని అమిత్‌షా స్పష్టం చేశారు.

హరియాణా ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను అమిత్‌షా ఖండించారు. "501 మంది ఓటర్లు ఉన్న ఇల్లు చిన్నది కాదు, ఎకరా పైగా విస్తీర్ణంలో ఉంది. ఒకే కుటుంబానికి చెందినవారు నివసిస్తున్నారు," అని ఈసీ నివేదికను ఉటంకిస్తూ తెలిపారు.

చర్చ మధ్యలో రాహుల్ గాంధీ జోక్యం చేసుకుని 19 లక్షల ఫేక్ ఓటర్లు ఉన్నారు అని ఆరోపించారు. దీనిపై అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేస్తూ "పార్లమెంటు మీ లెక్కల ప్రకారం నడవదు. నా ప్రసంగాన్ని వినే ఓపిక ఉండాలి," అని రాహుల్ గాంధీని హెచ్చరించారు.

## కొనసాగుతున్న ఇండిగో విమానాల రద్దు






- సీఈవోకు డీజీసీఏ సమన్లు
- గురువారం మధ్యాహ్నం 3 గంటల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థగా పేరుగాంచిన ఇండిగో ఎన్నడూ ఎదురుకాని విధంగా తీవ్రమైన కార్యకలాపాల అంతరాయాన్ని ఎదుర్కొంటోంది. వరుసగా విమానాలు రద్దు కావడం, రీషెడ్యూల్ అవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను పడుతున్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని విమానయాన మంత్రిత్వశాఖ ఇప్పటికే సేవలపై కోతలు విధించగా, తాజాగా డీజీసీఏ ఇండిగో సీఈవోకు సమన్లు జారీ చేసింది.

**డీజీసీఏ భారీ సమన్లు**

గురువారం మధ్యాహ్నం 3 గంటల్లోగా సేవల అంతరాయం, రద్దయిన విమానాలు, ఉద్యోగుల నియామక ప్రణాళికలకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించింది. అన్ని సంబంధిత విభాగాల సీనియర్ అధికారులతో కలిసి హాజరుకావాలని సూచించింది.

ఇక ఇండిగో సంక్షోభం బుధవారం కూడా కొనసాగింది. బెంగళూరులో ఒక్కరోజే 61 విమానాలు రద్దయ్యాయి. దేశవ్యాప్తంగా ఇంకా అనేక విమానాలు రద్దు/రీషెడ్యూల్ అవుతున్నాయి. రోజుకు సుమారు 2,300 విమానాలు నడపే ఇండిగోకు ఏవియేషన్ మార్కెట్‌లో 60% పైచిలుకు వాటా ఉంది. తాజా సంక్షోభంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 21,000 కోట్లకు పైగా క్షీణించింది.

మంగళవారం ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తున్నాయని ప్రకటించినప్పటికీ, నేలపై పరిస్థితి భిన్నంగా ఉండటంతో డీజీసీఏ నేరుగా జోక్యం చేసుకుంది. డిసెంబర్ 1 నుంచి ఇండిగో భారీ స్థాయిలో విమానాలను రద్దు చేయడం ప్రారంభించింది. కొత్తగా అమల్లోకి వచ్చిన డీజీసీఏ భద్రతా నియమాలకు తగిన ప్రణాళికలు రూపొందించడంలో సంస్థ విఫలమవడమే ప్రధాన కారణంగా పేర్కొనబడుతోంది. దీనివల్ల కార్యకలాపాల్లో భారీ గందరగోళం చోటుచేసుకుంది. విమాన రద్దులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులను లక్ష్యంగా చేసి కొందరు పోటీ విమాన యాన సంస్థలు టికెట్ ధరలను భారీగా పెంచాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చార్జీల నియంత్రణపై ఆదేశాలు జారీ చేసింది. డీజీసీఏ ఇండిగో శీతాకాల షెడ్యూల్‌లో 10% కోత విధించింది. దీని వల్ల సుమారు 220 విమానాలు తగ్గనున్నాయి. ఇది అవసరమైన చర్యేనని, కార్యకలాపాలను సవ్యంగా తీసుకెళ్లేందుకు సహాయపడుతుందని విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## నేడు పంచాయతి మొదటి పోరు

- 3,834 పంచాయతీలు, 27,628 వార్డుల్లో ఎన్నికలు
- 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్
- సీఎం రేవంత్‌రెడ్డి పై వచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్నాం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**బలగం టీవీ, హైదరాబాద్**




రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో నేడు మొదటి విడత పోరు జరగనుంది. 189 మండలాల్లో జరగను న్న సర్పంచ్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో నేడు జరగనున్న మొదటి విడత పోలింగ్ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, ఆ తర్వాత మధ్యాహ్నం 2గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. గురువారం సాయంత్రం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తామనీ, వీలు కాకుంటే శుక్ర వారం పూర్తి చేస్తామని అన్నారు. ఇప్పటికే అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్ల నియామకం జరిగిందని తెలిపారు. ఓటర్ స్లిప్‌ల పంపిణీ, సిబ్బందికి శిక్షణ పూర్తయ్యిందని ఆమె పేర్కొన్నారు. 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటారని అన్నారు. ఇందులో 27,41,070 మంది పురుష ఓటర్లు, 28,78,159 మంది మహిళా ఓటర్లు, 201 మంది ఇతరులు ఉన్నారని వివరించారు. 31 జిల్లాల్లో 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు 3,591 మంది రిటర్నింగ్ అధికారులను, 93,905 మంది ఇతర సిబ్బందిని నియమించినట్టు వివరించారు. ఓటు వేసే వారు తమ ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర 18 రకాల ఐడీ కార్డులలో ఏదైనా కేంద్రానికి తీసుకొచ్చేందుకు అనుమతించినట్టు తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న జిల్లాల్లో కలెక్టర్లకు మెజిస్ట్రీయల్ అధికారాలలిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. పోలింగ్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆమె ఓటర్లకు పిలుపునిచ్చారు.

మూడు విడతల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల ఏకగ్రీవాలన్నీ నిబంధనల ప్రకారమే జరిగాయని రాణి కుముదిని తెలిపారు. మూడు విడతల్లో 1204 సర్పంచ్, 25,551 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఏకగ్రీవాల్లో వేలం పాటల నిర్వహణ, దాడులు, దౌర్జన్యాలపై వస్తున్న వార్తలను ఆమె కొట్టి పారేశారు. ఏకగ్రీవాలు అయిన చోట నామినేషన్లు ఉప సంహరించుకున్న వారి నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకున్నామని గుర్తు చేశారు. కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన ఫిర్యాదును పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంసీసీ కమిటీకి ఫిర్యాదును పంపామనీ, కమిటీ నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు సంవత్సరాల ప్రజా పాలన ఉత్సవాల కోసం కాంగ్రెస్ పార్టీ వినతి మేరకు అనుమతిచ్చామని చెప్పారు. పీఎం నరేంద్రమోడీ మన్‌కీ బాత్ విషయంలోనూ తాము అనుమతిచ్చామని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో జరిగిన ఏకగ్రీవాల్లో ఒకటీ, రెండు చోట్ల చిన్న చిన్న సంఘటనలు జరిగాయనీ, వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకున్నామని ఆమె స్పష్టం చేశారు.

## సీఎంఆర్ఎఫ్‌లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నూతన రికార్డు


**బలగం టీవీ, హైదరాబాద్**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్స విషయంలో కీలక మద్దతుగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి , సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రికార్డు స్థాయిలో సహాయం అందించింది. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 డిసెంబర్ 6 వరకు ఎ కేవలం రెండేళ్లలోనే రూ. 1685.79 కోట్లు వైద్య సహాయంగా ప్రభుత్వం విడుదల చేసింది. 2014-24 మధ్య కాలంలో ఈ సరాసరి రూ. 450 కోట్లు అందిస్తే, గడిచిన ఈ రెండేళ్లలో ఏటా సుమారు రూ. 850 కోట్లు సహాయం అందించింది. రెండేళ్లలో మొత్తం రూ. 1685.79 కోట్లు అందించగా, అందులో వైద్య బిల్లుల రీయింబర్స్‌మెంట్ కోసం రూ. 1152.10 కోట్లు చెల్లించడం ద్వారా 3,76,373 మందికి సహాయం అందించారు.అలాగే, ఉచిత వైద్యం కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్‌గా 533.69 కోట్లు చెల్లించడం ద్వారా 27,421 మంది వైద్య చికిత్సలు పొందారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పౌరులకు అందిస్తున్న చికిత్సలకు సీఎంఆర్ఎఫ్ అదనం.ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రిలో చేరిన సందర్భంలో బిల్లులు చెల్లించిన తర్వాత అయిన ఖర్చులో కొంత భాగాన్ని తిరిగి చెల్లించవలసిందిగా సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే వైద్యం కోసం నిర్దిష్ట ప్రభుత్వ ఆసుపత్రుల్లో (నిమ్స్, ఎంఎన్‌జే, క్యాన్సర్ హాస్పిటల్, ప్రభుత్వ ఈఎన్‌టీ వంటి) చేరినప్పుడు చికిత్స కోసం ఖర్చు ప్రభుత్వం చెల్లిస్తుందన్న హామీ ఇచ్చే అధికారిక లేఖ జారీ చేస్తుంది. ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేకుండానే చికిత్స చేయించుకోవచ్చు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల ఘర్షణ

- కర్రలు, రాళ్లతో దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు
- బీఆర్ఎస్ కార్యకర్త మృతి
- సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో ఘటన





**బలగం టీవీ, నూతనకల్**

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త మృతి చెందాడు. పలువురికి గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు భారీగా మోహరించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..లింగంపల్లి గ్రామ సర్పంచ్ పదవి ఎస్సీ రిజర్వేషన్ అయింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా మాదాసు వెంకన్న పోటీలో ఉన్నాడు. కాంగ్రెస్ అభ్యర్థిగా దేశపంగు మురళి పోటీలో ఉన్నాడు. ఈ క్రమంలో ప్రచారం ముగియడంతో ఓట్ల సందర్భంగా వ్యవహరించాల్సిన విధానాలపై చర్చించేందుకు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మున్న మల్లయ్యయాదవ్, ఉప్పుల మల్లయ్య(57), మున్న లింగయ్య మరికొంత మంది కలుసుకున్నారు. దాంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఉప్పుల సతీష్, కొరివి గంగయ్యతోపాటు మరికొంత మంది అక్కడికి చేరుకొని బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుని.. వెంట తెచ్చుకున్న రాళ్ళు, కర్రలతో దాడి చేశారు. మున్న మల్లయ్యపై దాడి చేస్తుండగా అడ్డుకున్న ఉప్పుల మల్లయ్య తలపై కర్రలతో కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయాడు. అయినా వదలకుండా రాయితో తలపై గట్టిగా కొట్టడంతో మెదడు చితికింది. దాడిలో ఇరు పార్టీల వారికి గాయాలయ్యాయి. అక్కడ ఉన్న కొంతమంది 100కు ఫోన్ చేయడంతో పోలీసులు గ్రామానికి చేరుకోవడంతో పరారయ్యారు. మల్లయ్యను వెంటనే సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మల్లయ్య మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మల్లయ్య మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు. గ్రామాన్ని ఏఎస్పీ రంగారెడ్డి, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ నర్సింహారావు సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్త్ ఏర్పాటు చేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**మల్లయ్య మృతికి జగదీశ్ రెడ్డి నివాళి**

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉప్పుల మల్లయ్య మృతదేహాన్ని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ గుండాల అరాచకాలు భయాందోళనలు సృష్టిస్తున్నాయన్నారు. తుంగతుర్తిలో రౌడీయిజం పెరుగుతోందని తాము పలుమార్లు హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు యథేచ్ఛగా బెదిరింపులు, దాడులకు పాల్పడుతూ రాజకీయ హత్యలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## ఆటో కార్మికులను మోసగించిన కాంగ్రెస్




- ఆటో డ్రైవర్లకు బాకీ ఉన్న రూ. 1,560 కోట్లను తక్షణమే చెల్లించాలి
- ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పోరాటం తప్పదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఆటో డ్రైవర్ల ఆత్మీయ భరోసా కార్యక్ర మంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) బాండ్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆటోడ్రైవర్లు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న రూ. 1,560 కోట్ల బాకీని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుంటే హైదరాబాద్‌లో మహా ధర్నాకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆటో అన్నలతో బిఆర్ఎస్‌కు ఉన్న అనుబంధం కొత్తది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, కేసీఆర్ ప్రాణాలకు తెగించి ఆమరణ దీక్ష చేసినప్పుడు, రాష్ట్రవ్యాప్తంగా కదిలిన సబ్బండ వర్గాల్లో, ఆటో డ్రైవర్లు కూడా ముందుండి పోరాడారని, తెలంగాణ కావాలే, అయి తీరాల అని ర్యాలీలు తీసి కేసీఆర్‌కు మద్దతు గా నిలబడ్డారని గుర్తుచేశారు. వారి పాత్ర పోరాటంలో మరువలేనిదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కార్మికుల పట్ల తన ప్రేమను చాటుకున్నారని కేటీఆర్ తెలిపారు. కేవలం ఆటో అన్నలకే కాకుండా, రాష్ట్రంలోని సుమారు 6న్నర లక్షల నుంచి 7 లక్షల మంది ఆటో కార్మికులకు, అడగకుండానే, మ్యానిఫెస్టోలో పెట్టకుండానే, ఓట్ల కోసం దొంగమాటలు చెప్పకుండానే 5 లక్షల ప్రమాద బీమాను కల్పించారని వివరించారు.కేసీఆర్ రైతు బీమాను తీసుకొచ్చి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. దేశంలో రైతులకు బీమా ఇచ్చిన నాయకుడు కేసీఆర్ ఒక్కడే అని అన్నారు. అలాగే డ్రైవర్లకు, గీతన్నలకు, నేతన్నలకు బీమా ఇచ్చిన నాయకుడు కార్మిక పక్షపాతి కేసీఆర్ అని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లతో పాటు, అసంఘటిత రంగంలోని దాదాపు (13.50 లక్షల) పదమూడున్నర లక్షల మంది డ్రైవర్లకు (వ్యాన్లు, జీపులు, ట్రాక్టర్లు, టాక్సీలు, లారీలు) కూడా 5 లక్షల ప్రమాద బీమా కల్పించిన నాయకుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. సిరిసిల్ల జిల్లా కార్మిక, ధార్మిక, కర్షక క్షేత్రమని, నేతన్నలు, కర్షకులు (రైతులు), ధార్మికులు ఇక్కడ పెద్ద ఎత్తున ఉంటారని వివరించారు.

రాష్ట్రంలో మార్పు, మార్పు అంటూ జరిగిన మోసం ఎలా ఉంటుందో రెండేళ్లలో ప్రజలకు అర్థమైందని కేటీఆర్ విమర్శించారు. రైతులు, యువత, మహిళలు సహా అందరినీ 420 హామీలు ఇచ్చి మోసం చేశారని. రైతు రుణమాఫీ విషయంలో అబద్ధాలు చెబుతూ, దేవుళ్లపై అబద్ధపు ఒట్లు పెడుతున్నారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వంలో మంచిగా దర్జాగా బతికిన ఆటో డ్రైవర్ మష్రత్ అలీ, నేడు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీల వల్ల రెండు ఆటోలు అమ్ముకుని, కిరాయి ఆటో నడుపుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు.

**ఆటో డ్రైవర్లకు రూ.1,560 కోట్ల అప్పు**

నెలకు రూ. 1,000 చొప్పున ఆటో డ్రైవర్లకు ఇవ్వాల్సిన మొత్తాన్ని రెండేళ్లకు లెక్క కడితే, రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 1,560 కోట్లు అప్పు పడి ఉందని స్పష్టం చేశారు. ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కు రెండేళ్లకు రూ. 24,000 బాకీ ఉన్నారని. ఆటో డ్రైవర్లకు బీమా కల్పిస్తే, ఈ ప్రభుత్వం దాన్ని కూడా ఊడగొట్టిందని, అందుకే గతంలో 162 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వ హత్యే అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల హక్కుల సాధనకు తాము అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న అన్ని రకాల వాహనాల డ్రైవర్లకు సంక్రాంతి లోపు బీమా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు పెట్టకుంటే, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో మహా ధర్నా చేద్దామని పిలుపునిచ్చారు. "కాంగ్రెసోడు ఊరికే ఇవ్వడు. గళ్లా పట్టి అడిగితేనే ఇస్తాడు" అని అందుకే పోరాటం తప్పదని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఒక క్రెడిట్ సొసైటీ (కోఆపరేటివ్ సొసైటీ) గా ఏర్పడాలని వారికి సూచించారు.

# రాణిగంజ్ డిపో నుంచి 65 బస్సులు ప్రారంభం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- 65 నూతన ఎలక్ట్రిక్ బస్సులు బస్సులను నిర్వహించనున్న ఈవీ ట్రాన్స్
- టీజీఎస్ఆర్టీసీ 500 బస్సుల ప్రాజెక్ట్‌లో మరో ముందడుగు
- బస్సులను జెండా ఊపి ప్రారంభించిన మంత్రి




బలగం టీవీ, హైదరాబాద్

పర్యావరణ హిత మెట్రో ఎలక్ట్రిక్ బస్సులు 65 బుధవారం హైదరాబాద్ రోడ్లు ఎక్కాయి. ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహణలో నడిచే ఈ బస్సులను రాణిగంజ్ డిపో లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆ తరువాత రాణిగంజ్ డిపో నుంచి తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి వరకు బస్సులో ప్రయాణించారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి ,హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, ఈవీ ట్రాన్స్ సీఈఓ సందీప్ రైజాడ , సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, నార్త్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ పీవీ మునిశేఖర్, సిహెచ్ వెంకన్న, ఎం రాజశేఖర్, కార్పొరేటర్ సుచిత్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీజీఎస్ఆర్టీసీ ) భాగస్వామ్యంతో 65 కొత్త 12–మీటర్ల లో–ఫ్లోర్ ఎలక్ట్రిక్ సిటీ బస్సులను ఈవీ ట్రాన్స్ ప్రారంభించింది. పర్యావరణ హిత , ఆధునిక, విశ్వసనీయమైన ప్రజా రవాణా సేవలను హైదరాబాద్ నగరానికి అందించాలనే లక్ష్యంతో చేపట్టిన టీజీఎస్ఆర్టీసీ 500 లో–ఫ్లోర్ సిటీ ఈ–బస్ ప్రాజెక్ట్‌లో ఈ బస్సులను ప్రవేశ పెట్టడం ఓ ముఖ్యమైన దశగా నిలిచింది.

ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా మొత్తం 450 నాన్–ఏసీ , 50 ఏసీ లో–ఫ్లోర్ సిటీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటివరకు 325 బస్సులను ఈవీ ట్రాన్స్ సరఫరా చేసింది. మిగిలిన 175 బస్సులను 2026 జనవరి నాటికి టీజీఎస్ ఆర్టీసీకి ఈవీ ట్రాన్స్ అందించనుంది. ఈ బస్సుల సరఫరాతో హైదరాబాద్ నగరంలో సుస్థిర రవాణా మౌలిక వసతులు మరింతగా బలోపేతం కానున్నాయి. 36 సీట్ల సామర్థ్యంతో కొత్తగా ప్రవేశపెట్టిన 12–మీటర్ల లో–ఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులను లిథియమ్–అయాన్ బ్యాటరీలు, రీజెనరేటివ్ బ్రేకింగ్, రియల్ టైమ్ ట్రాకింగ్‌తో కూడిన ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్, ఫైర్ డిటెక్షన్, సప్రెషన్ సిస్టమ్, అధునాతన మోటార్%––%కంట్రోలర్ టెక్నాలజీ వంటి అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించారు. ఈ బస్సుల్లో ఆటోమేటెడ్ అనౌన్స్‌మెంట్స్, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, యూఎస్‌బీ ఛార్జింగ్ పాయింట్లు, వృద్ధులు , దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి. ఈ బస్సులు సికింద్రాబాద్, కొండాపూర్, ఇస్నాపూర్, బోరబండ, రామాయంపేట్, గచ్చిబౌలి, మియాపూర్ వంటి ప్రధాన రూట్లలో నడవనున్నాయి. దీంతో రోజువారీ ప్రయాణికుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఈ కొత్త బస్సుల వల్ల శబ్ధ, వాయు కాలుష్యం, ఆపరేషనల్ ఖర్చులు తగ్గడం తో పాటు హైడెన్సిటీ రూట్లపై ప్రయాణించే ప్రజలు మరింత సుఖవంతమైన, పర్యావరణ హితం ప్రయాణ అనుభవం పొందనున్నారు.

రాణిగంజ్ డిపో నుంచి నడపనున్న వంద ఈ బస్సుల్లో నేడు ప్రారంభించిన 65 బస్సులు కూడా ఉన్నాయి. నగరంలోని కంటోన్మెంట్, మియాపూర్ , హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, హయత్‌నగర్, రాణిగంజ్ డిపో సహా మొత్తం అయిదు ముఖ్య డిపోల నుంచి ఎలక్ట్రిక్ బస్సులను ఆర్ టి సి నడుపుతోంది. ఈ ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభంతో టీజీఎస్ఆర్టీసీ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా హైదరాబాద్ నగరానికి ప్రపంచ స్థాయి, పర్యావరణహిత, ప్రయాణీకులకు అనుకూలమైన ప్రజా రవాణా సేవలను అందించాలనే తమ లక్ష్యాన్ని మరోసారి చాటుకున్నాయి.

ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా శాఖ తరుపున ఆర్టీసీ రాణిగంజ్ డిపో నుండి 65 బస్సులు ప్రారంభించామన్నారు. ఇప్పటికే హైదరాబాద్ ,కరీంనగర్ , నిజామాబాద్ , నల్గొండ ,సూర్యాపేట మార్గాల్లో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. ఢిల్లీ లో రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యంతో ప్రజలు జీవించలేని పరిస్థితి, ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ , స్క్రాప్ పాలసీ తీసుకొచ్చింది. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు వివిధ పుణ్యక్షేత్రాలకు ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతాము. ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం వల్ల నగరంలో ప్రయాణికులకు మరిన్ని బస్సులు అందుబాటులోకి వచ్చాయి. నగర శివారు ప్రాంతాలకు బస్సులు అందుబాటులో లేని పరిస్థితుల్లో ఎక్కడెక్కడ బస్సులు అవసరమో సర్వే చేసి ముఖ్యమంత్రి సూచనలతో 373 కొత్త కాలనీలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచాలని నిర్ణయం తీసుకోవటం జరిగింది. ఇప్పటి నుంచి ఆ కాలనీ లకు బస్సులు నడుస్తాయి అన్నారు. ఆర్టీసీ ఎండీ వై . నాగిరెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో వచ్చే రెండు సంవత్సరాల్లో 2800 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. ప్రతి బస్ ఒక రోజు ఒక టన్ కార్బన్ డై ఆక్సైడ్ ను తగ్గిస్తుంది అన్నారు. ఈవీ ట్రాన్స్ సీఈఓ సందీప్ రైజాదా మాట్లాడుతూ "ఈరోజు ప్రారంభించిన ఈ బస్సులతో దేశవ్యాప్తంగా మా బస్సులు నడిచే డిపోల సంఖ్య 69కి చేరింది. తెలంగాణలో రాణిగంజ్ డిపో ఐదోది. రాష్ట్రంలో మొత్తం ఆరు డిపోల మా విస్తరణ ప్రణాళికలో ఇది కీలకమైన ముందడుగు. ప్రస్తుతం దేశంలోని 10 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి 3,100కుపైగా బస్సులను విజయవంతంగా నడుపుతున్నాం. నేడు మరో 65 ఎలక్ట్రిక్ బస్సులను మా ఫ్లీట్‌లో చేర్చడం గర్వంగా ఉంది. మిగిలిన బస్సులను 2026 జనవరి నాటికి అందజేస్తాము " అన్నారు.




## మలేసియాలో జైలు పాలైన సిద్ధిపేట కార్మికుడు..

- న్యాయ సహాయం కోసం తాజాగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి..
- ఇదివరకే ఎంపీ రఘునందన్ రావు ద్వారా దౌత్య ప్రయత్నాలు

బలగం టీవీ, సిద్దిపేట

ఉద్యోగం నిమిత్తం మలేసియా వెళ్లి, సహోద్యోగితో జరిగిన గొడవ కారణంగా గత 11 నెలలుగా జైలులో మగ్గుతున్న సిద్ధిపేట జిల్లాకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్ విడుదలకు న్యాయ, దౌత్య సహాయం అందించాలని ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

సిద్ధిపేట జిల్లా, అక్బర్‌పేట – భూంపల్లి మండలం పోతరెడ్డిపేట గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్ భార్య సలీమా బేగం, కుమారుడు సల్మాన్ మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో గల సీఎం ప్రవాసీ ప్రజావాణి' లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రాన్ని సమర్పించారు. తమకు తక్షణమే న్యాయ సహాయం (లీగల్ ఎయిడ్), దౌత్య సహాయం (కాన్సులార్ హెల్ప్) అందించాలని సలీమా బేగం ముఖ్యమంత్రిని వేడుకున్నారు. తాము ఈ విషయంపై ఇదివరకే మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావును సంప్రదించినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ సూచనలతో ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించినట్లు తెలిపారు. ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి వారికి ఈ సందర్భంగా మార్గదర్శనం చేశారు. 2018లో ఉద్యోగం కోసం మలేసియాకు వెళ్లిన ఖాదర్, అక్కడ సహోద్యోగితో జరిగిన గొడవ కారణంగా జైలు పాలయినట్టు కుటుంబ సభ్యులు వివరించారు. మలేసియాలోని తెలంగాణ సామాజిక సేవకుడు బూరెడ్డి మోహన్ రెడ్డి, కౌలాలంపూర్‌లోని ఇండియన్ హైకమీషన్‌తో ఈ కేసు విషయంలో సమన్వయం సాగిస్తున్నారని వారు తెలిపారు.ఈ సందర్భంగా ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం ప్రతినిధి మహ్మద్ బషీర్ అహ్మద్, నేషనల్ వర్కర్ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధి భార్గవి, బహరేన్ లోని తెలంగాణ సోషల్ వర్కర్ నోముల మురళి, తెలంగాణ ప్రభుత్వ జీఏడి ఎన్నారై శాఖ సెక్షన్ ఆఫీసర్ కంచర్ల శ్రీనివాస రెడ్డి, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు రాజీవ్ కుమార్, సమీనా బేగంలు ఆ కుటుంబాన్ని ఓదార్చి, ధైర్యం చెప్పారు.

## కాంగ్రెస్ హత్యా రాజకీయాలను సహించేది లేదు..

- ఓటమి భయంతోనే కాంగ్రెస్ భౌతిక దాడులు.. ఉప్పుల మల్లయ్య హత్య అత్యంత హేయం
- పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- ఎవరూ అధైర్యపడవద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవీ, సూర్యాపేట

సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న 'హత్యా రాజకీయాల'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పుల మల్లయ్య ప్రాణాలు కోల్పోవడం పట్ల కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోలేక, భౌతిక దాడులకు దిగడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనం. అధికార మదంతో కాంగ్రెస్ గూండాలు సాగిస్తున్న అరాచకాలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని కేటీఆర్హెచ్చరించారు. గత రాత్రి లింగంపల్లి గ్రామంలో సుమారు 70 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్లతో బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఉప్పుల మల్లయ్య మృతి చెందగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ తో పాటు మరో 15 మంది కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురించి తెలుసుకున్న వెంటనే కేటీఆర్ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ లతో ఫోన్లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. ఎవరూ అధైర్య పడవద్దు. మరణించిన కార్యకర్త కుటుంబానికి మరియు గాయపడిన వారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం



బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ ఏ. పి . జె. అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి గత 15 సంవత్సరాలుగా సైకాలజిస్ట్ గా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ సైకాలజిస్ట్ పున్నంచందర్ కనుకుంట్ల కు బెస్ట్ సోషల్ సర్వీస్ అండ్ సైకాలజిస్ట్ అవార్డ్ ను అందుకున్నారు. హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ, స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న అల్వాల ఈశ్వర్ , హ్యూమన్ రైట్స్ కౌన్సెల్ రాజన్న సిరిసిల్ల జిల్లా వైస్ చైర్మన్ మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో సేవలు అందిస్తున్న గడ్డం దినకర్ లకు ఉత్తమ సామాజిక సేవ అవార్డులు అందుకున్నారు.

ఈ కార్యక్రమానికి అతిథులుగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల విజయ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ హనుమా గౌడ్ లు హాజరై మాట్లాడినారు. మానవ హక్కుల రక్షణ కోసం అందరూ క ృషి చేయాలని పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కౌన్సెల్ కన్వీనర్ గాజుల వేణు కుమార్, రాష్ట్ర విమెన్ వింగ్ డైరెక్టర్ గజ్జెల కరుణ లు అవార్డీ లను

## ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీ చేసిన జిల్లా వ్యయ పరిశీలకులు

బలగం టీవీ, వీర్నపల్లి

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. వీర్నపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.



## స్టార్టప్‌లకు రూ.1000 కోట్ల ఫండ్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నా, అంటే కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలు ఎదగాలి. అలాగే 2034 నాటికి వాటిల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. రాష్ట్రంలో అందుకోసం అవసరమైన ఒక మంచి వాతావరణం ఏర్పాటు చేస్తాం. స్టార్టప్‌లకు అవసరమైన సహకారం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ కలిసి పనిచేయబోతున్నాయి. స్టార్టప్ కోసం ప్రభుత్వం వెయ్యి కోట్లతో స్టార్టప్ నిధిని ఏర్పాటు చేస్తాం. ఆ నిధిని వినియోగించుకుని తద్వారా భవిష్యత్తులో స్టార్టప్‌లు గూగుల్ స్థాయిలో లేదా కనీసం 1 బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలని ఆశిస్తున్నామని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.




## ఈవీఎంల గోడౌన్ తనిఖీ చేసిన ఎన్నికల సంఘం సీఈఓ

- **ఈవీఎంలను పరిశీలించిన సీఈఓ సుదర్శన్ రెడ్డి, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ వద్ద ఉన్న ఎలెక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల గోడౌన్ ను ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ వద్ద ఉన్న ఈవీఎంల గోడౌన్ తనిఖీ చేసేందుకు ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి సీఈఓ సుదర్శన్ రెడ్డి చేరుకోగా, జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఈఓ.. ఇంచార్జి కలెక్టర్ తో పలు అంశాలపై చర్చించారు. అక్కడి నుంచి సీ ఈ ఓ నేరుగా సర్దాపూర్ లోని ఈవీఎం గోడౌన్, ఈవీఎంలను ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేష్ కుమార్, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఈసీ నిబంధనలకనుగుణంగా విధులు నిర్వర్తించాలి

- **ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**
- **కోనరావుపేట, చందుర్తి,వేములవాడ రూరల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో తనిఖీ**




**బలగం టీవీ, కోనరావుపేట/ చందుర్తి/ వేములవాడ రూరల్**

రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా కోనరావుపేట, చందుర్తి, వేములవాడ రూరల్ మండలాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు.



ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎస్ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీపీహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.






## ఎన్నికల నేపథ్యంలో ఫ్లాగ్ మార్చ్..

- **శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న పోలీసులు**

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచనల మేరకు డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు కొదురుపాక, నీలోజిపల్లి గ్రామాలలో ఈ ఫ్లాగ్ మార్చ్‌ను విస్తృతంగా చేపట్టారు. గ్రామాల్లో ప్రజలను పలకరిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణపై పోలీసులు అవగాహన కల్పించారు. వేములవాడ రూరల్ ఎస్సైలు, వెంకట్ రాజం, ఆర్ఎస్ఐ శ్రీనివాస్ లతో పాటు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్, పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మొదటి విడత పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత..

- **రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ మొదటి విడత పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికలు జరుగు మండలాలలో ఎన్నికలు పురస్కరించుకొని బందోబస్త్ కు వచ్చిన పోలీస్ సిబ్బందికి ఆయా పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలింగ్ జరుగు సమయంలో,ఓట్ల లెక్కింపు సమయంలో పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో రూట్ మొబైల్ పోలీస్ అధికారులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, పోలింగ్ కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో గుంపులుగా లేకుండా జాగ్రత్తపడాలన్నారు. ఏదైన సమస్య తలెత్తినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎస్పీ వెంట పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.




## మనిషి గౌరవంగా జీవించేందుకు మానవ హక్కులు మూలాధారం...

- **సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జె.శ్రీనివాసరావు**

**బలగం టీవీ, సిరిసిల్ల**

ప్రతి మనిషి గౌరవంగా జీవించేందుకు మానవ హక్కులు మూలాధారమని, అందరూ హక్కులు తెలుసుకొని ఇతరుల హక్కులను గౌరవించాలని సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ. జె.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి.నీరజ గారి ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, DLSA పి.లక్ష్మణాచారి గారి సమన్వయంతో బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జ్యోతి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనను ఆమోదించిందని, అందుకే ఈ రోజును ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సహాయం ద్వారా ప్రజల హక్కులను రక్షిస్తోందని అన్నారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు/న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ .పి.పద్మ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో 15 నుండి సదరం శిబిరాలు..

- **జిల్లాలోని దివ్యాంగులకు శుభవార్త..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డిసెంబర్ 15, 2025 నుండి డిసెంబర్ 20, 2025 వరకు సదరం (%బాూణాూక్ష్మజువీ%) శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. దివ్యాంగులకు %ఖణక్ష్మిణ% సర్టిఫికెట్ల జారీ కోసం ఈ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. సంబంధిత వైద్యుల సూచనల మేరకు వివిధ విభాగాలకు సంబంధించిన క్యాంపుల తేదీలను, పరీక్షించబడే దివ్యాంగుల సంఖ్యను వివరంగా ప్రకటించారు.

| క్రమ సంఖ్య | క్యాంపు తేదీ | రోజు | విభాగము |
|---|---|---|---|
| 1 | 15.12.2025 | సోమవారం | కంటిచూపు- 21 |
| 2 | 16.12.2025 | మంగళవారం | ఆర్తో - 45 |
| 3 | 16.12.2025 | మంగళవారం | మానసిక- 25 |
| 4 | 17.12.2025 | బుధవారం | మానసిక- 20 |
| 5 | 17.12.2025 | బుధవారం | జనరల్ -- 06 |
| 9 | 17.12.2025 | బుధవారం | వినికిడి -- 35 |
| 6 | 18.12.2025 | గురువారం | ఆర్తో -- 45 |
| 10 | 18.12.2025 | గురువారం | వినికిడి-- 36 |
| 7 | 19.12.2025 | శుక్రవారం | ఆర్తో -- 45 |
| 8 | 20.12.2025 | శనివారం | ఆర్తో -- 45 |

పైన తెలిపిన తేదిలలో సదరం శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు ఉదయం 09:30 గంటలకు చేరుకోవాలి. తమ వెంట మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్-రే, %ఖణక్ష్మిణ% అప్లికేషన్ ఫామ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, మరియు ఫోన్ నెంబర్ తప్పనిసరిగా తీసుకురావాలి. సదరం క్యాంప్‌కు హాజరయ్యే వారి పేర్లు మరియు వివరాలు ఇప్పటికే పంచాయతీ కార్యదర్శి / మున్సిపాలిటీలలో బిల్లు కలెక్టర్‌కు పంపడం జరిగింది. ఈ వివరాలను మండల అభివృద్ధి అధికారులు మరియు కమిషనర్లు (సిరిసిల్ల, వేములవాడ) తమ పరిధిలోని దివ్యాంగులకు తెలియజేసి, వారికి సమాచారం అందేలా చూడాలని కోరనైనది.



## మాజీ ఎంపీటీసీని పరామర్శించిన కేటీఆర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, అశ్విని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దమ్మన్నపేట మాజీ ఎంపీటీసీ అంబర్ నాయక్ ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పరామర్శించారు. బుధవారం ఆసుపత్రికి చేరుకున్న కేటీఆర్, అంబర్ నాయక్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. అంబర్ నాయక్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందిని కోరారు. త్వరగా కోలుకోవాలని అంబర్ నాయక్‌కు కేటీఆర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు కేటీఆర్‌తో పాటు ఆసుపత్రికి వచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా కేటీఆర్ పేర్కొన్నారు.

# జర్మనీకి ఎనిమిదో కప్

- జూనియర్ హాకీ ప్రపంచకప్
- భారత్‌కు మూడో స్థానం



బలగం టీవీ, హైదరాబాద్

2025 పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్ ఫైనల్లో జర్మనీ స్పెయిన్‌ను షూటౌట్‌లో 3-2తో ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది. నిర్ణీత సమయంలో స్కోరు 1%-%1గా ఉండడంతో మ్యాచ్ షూటౌట్‌కు వెళ్లింది.ఇది జర్మనీకి ఎనిమిదో జూనియర్ ప్రపంచకప్ టైటిల్ కావడం గమనార్హం. గత ఎడిషన్ విజేతగా ఉన్న జర్మనీ మరోసారి టైటిల్‌ను కాపాడుకుంది.

**భారత్‌కు బ్రాంజ్**

పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు బ్రాంజ్ పతకాన్ని సాధించింది. సెమీఫైనల్‌లో ఓటమి తర్వాత మూడోస్థాన పోరులో అర్జెంటినాతో తలపడిన భారత్ 4-2 తేడాతో గెలిచి టోర్నీని మెడల్‌తో ముగించింది.

అంకిత్ పాల్, మన్మీత్ సింగ్, శ్రద నంద్ తివారి, అన్‌మోల్ ఎక్కా భారత్ తరపున తలో గోల్ చేశారు. అర్జెంటీనా తరపున నికోలస్ రోడ్రిగ్జ్, శాంటియాగో ఫెర్నాండెజ్ గోళ్లు చేసినా భారత్ విజయం దిశ మార్చలేదు. ఈ మ్యాచ్‌లో ఘనంగా రాణించిన అన్‌మోల్ ఎక్కా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్నాడు. ఈ విజయంపై హాకీ ఇండియా ప్లేయర్లకు నజరానాను ప్రకటించింది.

ఒక్కో ఆటగాడికి రూ.5 లక్షలు సపోర్టింగ్ స్టాఫ్ సభ్యులకు రూ.2.5 లక్షలు అందించాలని నిర్ణయించింది.భారత్ చివరిసారిగా 2016లో జూనియర్ ప్రపంచకప్‌ను గెలిచింది. 2021, 2022లో నాలుగో స్థానానికే పరిమితమైందిన భారత జట్టు ఈసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. అయితే సెమీఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ చేతిలో 1%-%5 తేడాతో ఓడిపోయింది. ఈ టోర్నీ చరిత్రలో భారత్ మొదటిసారిగా మూడోస్థానంలో నిలవడం విశేషం.




# ఓయూకు వెయ్యి కోట్ల రూపాయల గ్రాంట్

- సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్




ఉద్యమ కాలంలో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థినీ విద్యార్థులు ఆకాంక్షించిన స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. చారిత్రాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గత వైభవం తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు.విశ్వవిద్యాలయ అభివృద్ధికి వెయ్యి కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ జారీ అయిన ఉత్తర్వులను విడుదల చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్, డిజైన్లను విద్యార్థుల సూచనల కోసం రూపొందించిన క్యూఆర్ కోడ్ ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 108 సంవత్సరాల చరిత్ర కలిగి దేశంలోనే అత్యంత పురాతన యూనివర్సిటీల్లో 7 వ స్థానం, దక్షిణ భారత దేశంలో 3 వ ప్రాధాన్యత కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ అలనాటి స్ఫూర్తితో భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకునే క్రమంలో అందరినీ కలవాలని వచ్చానని చెప్పారు. "గుండె నిండా అభిమానంతో యూనివర్సిటీకి వచ్చా. ఆర్ట్స్ కాలేజీ ముందు నిలబడి విశ్వవిద్యాలయ అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికలు రచించడానికి వచ్చాను. ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఇక్కడికి వచ్చా.సమాజానికి ఏ సమస్య వచ్చినా యూనివర్సిటీ విద్యార్థులు కదలడం వల్లే ఆ సమస్యకు పరిష్కారం లభించింది. అందులో తెలంగాణ ఉద్యమం కూడా. ఉద్యమాలతో విద్యార్థులు ఏమీ ఆశించలేదు. వారు స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కావాలని అడిగారు.యూనివర్సిటీని కాలగర్భంలో కలపడానికి కొందరు కుట్రలు పన్నారు. ఉస్మానియా ప్రపంచానికి దిక్సూచిలా గొప్పగా ఎదగాలన్నది నా సంకల్పం. విద్య ఒక్కటే అందరి జీవితాల్లో వెలుగులు నింపుతుంది. వెనుకబాటు నుంచి బయటపడేస్తుంది. ఆత్మగౌరవం పెరుగుతుంది. తల్లిదండ్రుల్లో ఆనందం నింపుతుంది.

చదువుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలి. సమస్యలొచ్చినప్పుడు నిటారుగా నిలబడి కొట్లాడండి. ప్రపంచాన్ని నడిపించగలరని నిరూపించాలి. నిబద్ధతతో కృషి చేయండి. ఇక్కడున్న వారిలోనే రేపు ఇలాంటి వేదిక నుంచి మాట్లాడే అవకాశం రావొచ్చు. మీలో కొందరు నాయకులై రాష్ట్రాన్ని పాలించాలని కోరుకుంటున్నా.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు చెప్పినట్టు అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. నిజమైన సంక్షేమం పేద వాడికి చేరాలి. సామాజిక సమస్యలపై శాశ్వత పరిష్కారం కావాలని మేం ప్రయత్నిస్తున్నాం.ప్రతి బడిలో వినిపించాల్సిన 'జయ జయహే తెలంగాణ..' గీతం గత పదేళ్లుగా తొక్కి పెడితే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని రాష్ట్ర గీతంగా మార్చాం. బహుజనుల తెలంగాణ తల్లిని ఆవిష్కరించాం.

30-40 ఏళ్లుగా రగిలిన వర్గీకరణ అంశం దళిత బిడ్డల మధ్య విభజన రేఖను గీసింది. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఈ సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన చేయలేదు. ఈ సామాజిక సమస్యను పరిష్కరించిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ.గడిచిన వందేళ్లుగా ఈ దేశంలో బలహీన వర్గాల లెక్కలు లేవు. ప్రభుత్వం ఆలోచన చేసి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ కుల రాజకీయ గణన పూర్తి చేశాం. తద్వారా కేంద్రంపై ఒత్తిడి పెరిగి 2026 లో చేపట్టే జన గణనలో ఆ అంశాన్ని చేర్చారు.దళితులు, ఆదివాసీలు, గిరిజనులు. బడుగు బలహీన వర్గాలు, రైతులు, మహిళలు నిండుమనసుతో ఆశీర్వదిస్తేనే ఈ స్థాయిలో ఉన్నా. ఇలాంటి అవకాశం ఏ ఒక్కరికో వస్తుంది. అందుకే చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా ఏదైనా చేయాలన్న సంకల్పం నాలో ఉంది. మనకు విద్య అందుబాటులో ఉంది కానీ నాణ్యమైన విద్య అందకపోవడమే సమస్య. నైపుణ్యం కలిగిన విద్యను అందించాల్సిన అవసరం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేరుతో వేర్వేరుగా పాఠశాల నిర్వహణ వల్ల వివక్ష ఎలా రూపుమాపగలం.అందుకే ఆలోచన చేసి విద్యార్థులంతా ఒకే క్యాంపస్ లో చదువుకోవాలన్న లక్ష్యంగా మహాత్మాగాంధీ గారి స్ఫూర్తితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ చేపట్టాం.విద్య కోసం పెట్టే ఖర్చు భవిష్యత్తరాల కోసం పెట్టుబడిగా చూస్తున్నాం. పిల్లల్లో నైపుణ్యాన్ని వెలికి తీయాల్సిన అవసరం ఉంది. పరిశోధనల్లో ఇబ్బంది పడొద్దు. ప్రపంచంతో పోటీ పడాలి. ఆత్మస్థయిర్యం కోల్పోవద్దు. నాలెడ్జ్ వేరు, కమ్యూనికేషన్ వేరు. నాలెడ్జ్, కమిట్మెంట్, కన్విక్షన్ దేశంలో ఏ స్థాయికి ఎదగడానికైనా ఉపయోగపడుతుంది. యూనివర్సి టీలో నియామకాలు, నిర్ణయాల్లో ఎవరి పైరవీలు ఉండవు. రాజకీయ జోక్యం ఉండదు. పైరవీ చేసే వారి ఉద్యోగం తీసేద్దాం. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోండి. పిల్లల జీవితంతో ఆటలాడే హక్కు ఎవరికీ లేదు. కావలసిన సహకారం అందించే బాధ్యత మాది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గారు, సలహాదారులు కేశవ రావు గారు, వేం నరేందర్ రెడ్డి గారు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి గారు, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ ములుగరం గారు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ కాశీం గారు, ప్రజా ప్రతినిధులు, పలు విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు, అధికారులు పాల్గొన్నారు.



# వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో రో.కో

- అగ్రస్థానం దక్కించుకున్న రోహిత్ శర్మ
- రెండో స్థానానికి విరాట్ కోహ్లీ

బలగం టీవీ, హైదరాబాద్

అద్భుతమైన ఫామ్‌లో ఉన్న టీమిండియా రన్‌మిషన్ విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో మరో మెట్టు ఎక్కాడు. మూడు నుంచి రెండో స్థానానికి ఎగబాకి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ అయితే అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో రోహిత్-కోహ్లీ దుమ్మురేపారు. రోహిత్ శర్మ రాంచీ, విశాఖపట్నం వన్డేల్లో వరుసగా 57, 75 పరుగులతో హాఫ్ సెంచరీలు సాధించాడు. మరోవైపు విరాట్ కోహ్లీ మొదటి రెండు వన్డేల్లో వరుస సెంచరీలు (135, 102) బాదగా, మూడో వన్డేలో 65లి పరుగులతో అజేయంగా నిలిచి వింటేజ్ విరాట్‌ను గుర్తు చేశాడు. మొత్తం 302 పరుగులతో సిరీస్ టాప్ స్కోరర్‌గా రాణించాడు. ఇక న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ మూడో స్థానానికి జారిపోగా, అఫ్గానిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ నాలుగో స్థానంలో ఉన్నాడు. భారత యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలిచాడు. టీమిండియా బ్యాటర్ల అద్భుత ఫార్మ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ ఆధిపత్యాన్ని మరింత బలపరచింది.

# వెంకటేశ్-త్రివిక్రమ్ మూవీ టైటిల్ ఆదర్శ కుటుంబం

బలగం టీవీ, హైదరాబాద్





మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్-విక్టరీ వెంకటేశ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న కొత్త చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను బుధవారం చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెంబర్ 47' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రకటించింది. ఈ సందర్భంగా హీరో వెంకటేశ్ ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. కుటుంబ కథా చిత్రానికి తగ్గట్టుగా ఫ్యామిలీ మాన్‌లా కనిపిస్తూ వెంకిమామ కొత్త అటిట్యూడ్‌లో కనిపించారు. గతంలో ఈ కాంబినేషన్‌లో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలు ప్రేక్షకుల్ని విశేషంగా అలరించిన నేపథ్యంలో, ఇన్నాళ్ల తర్వాత మళ్లీ వీరిద్దరూ కలసి చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రబృందం తెలిపిన వివరాల ప్రకారం, ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఇందులో వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి నటించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని 2026 సమ్మర్ కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# దివి వైద్య అగ్రెసివ్ లుక్ విడుదల

- పాన్ ఇండియా మూవీ 'కర్మ స్థలం'పై హైప్ పెంపు

బలగం టీవీ, హైదరాబాద్




అభిమానులకు ప్రత్యేకమైన పరిచయం అవసరం లేని దివి వైద్య ఈసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో ప్రేక్షకుల ముందుకు రానుంది. బిగ్ బాస్‌లో మెరిసిన ఈ భామ, గాడ్‌ఫాదర్‌తో సహా పలు తెలుగు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా దివి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'కర్మ స్థలం' చిత్రంలోని ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు.

దివి లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం కర్మ స్థలం. రాకీ షర్మన్ డైరెక్ట్ చేస్తున్నాడు. దివి యోధురాలిగా కదనరంగంలోకి దిగి పోరాడుతున్న అగ్రెసివ్ లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. బ్యాక్ గ్రౌండ్‌లో అగ్నికీలలు మధ్య సైన్యాన్ని చూడొచ్చు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు చంకీ పాండే, అరవింద్ కృష్ణ, అర్చనా శాస్త్రి కాలకేయ ప్రభాకర్, బలగం సంజయ్, మిథాలి చౌహాన్‌తోపాటు పలువురు నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సామ్రాద్ని ఫిల్మ్స్, రాయ్ ఫిల్మ్స్ బ్యానర్లపై హర్షవర్దన్ షిండే నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి కార్తీక్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్‌గా చేసుకుని హై స్టాండర్డ్ విజువల్స్‌తో సినిమాను రూపొందిస్తున్నట్టు ఫస్ట్ లుక్‌తో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్ రాకీ షర్మన్.